రోడ్డు పనులు చేపట్టాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: డివిజన్ పరిధిలోని చంద్రపురి ఎక్స్‌టనేషన్ రోడ్డుకు రూ.24 లక్షల నిధులు మంజూరు కాగా పనులను తహసీల్దార్ ఆపివేశారు. దీంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని గురువారం కలిసి సమస్యను వివరించారు. పనులు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బైరీ నవీన్ గౌడ్, కాలనీ అధ్యక్షులు సంతోష్, నాగేశ్వర్‌రావు, భద్రయ్య, రామకృష్ణ రెడ్డి, దామోదర్ ఉన్నారు.

రోడ్ల మరమ్మతుల పరిశీలన



ప్యాచ్ వర్క్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: డివిజన్‌లో గుంతలు పడిన బీటీ రోడ్లకు జీహెచ్ఎంసీ సిబ్బంది చేపడుతున్న ప్యాచ్ వర్క్ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు తక్షణమే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘సుప్రీం సీజేఐపై దాడిపై ఖండన’



సమావేశంలో క్రైస్తవ సంఘాల నాయకులు

గౌతంనగర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ బక్క ఏలియా అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టులో ఇలాంటి దాడి జరగడం వల్ల న్యాయ వ్యవస్థ గౌరవానికి తీవ్ర భంగం వాటిల్లిందన్నారు. ఇది కేవలం జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి మాత్రమే కాదని.. భారత న్యాయవ్యవస్థ, రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. జస్టిస్ గవాయ్‌కు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటిస్తుందన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పోచారం: పోచారం ప్రాంతానికి చెందిన డ్రైవర్ చిట్టగాని వెంకన్న (48) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసును పోచారం ఐటీ కారిడార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇద్దరు నిందితులు మల్లేశ్ (35), వివేక్ (24ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారంలో అద్దెకు ఉంటున్న వివేక్ కూలి పని చేస్తుండగా, మల్లేశ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మహబూబాబాద్‌కు చెందిన వీరిద్దరూ మిత్రులు. కాగా 3 రోజుల క్రితం వివేక్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను వెంకన్న అపహరించాడు. దొంగతనం గురించి తెలుసుకున్న వివేక్ తన మిత్రుడు మల్లేశ్ సాయంతో బుధవారం సాయంత్రం జోడిమెట్ల వద్ద ఉన్న వెంకన్నను ఆటోలో ఎక్కించుకున్నారు. ఫోన్ గురించి ఆరా తీయగా జీడిమెట్లలోని ఓ దుకాణంలో కుదువ పెట్టినట్లు వెంకన్న చెప్పాడు. ఆ దుకాణానికి వెళ్లి ఫోన్ తీసుకుని అక్కడే వెంకన్నపై ఇద్దరు దాడి చేశారు. అనంతరం వెంకన్నను ఆటోలో ఎక్కించుకుని పోచారంలోని శివాలయం సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. కట్టెలతో దారుణంగా కొట్టారు. పరిస్థితి విషమంగా మారడంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి ఇంటికి తీసుకెళ్లారు. చెమటలు, ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివేక్‌తో పాటు మల్లేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

అధ్వాన రోడ్లు..

అవస్థలమయం..!

గౌతంనగర్ డివిజన్‌లో అస్తవ్యస్తంగా ప్రధాన, అంతర్గత రోడ్లు

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

గౌతంనగర్: డివిజన్‌లోని ప్రధాన, అంతర్గత రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ఓ వైపు గుంతలు.. మరో వైపు కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. అసలే ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ద్విచక్రవాహనదారులు రోడ్లపై ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రాణాలు అరచేతిలో బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. ఉత్తంనగర్ ఏవోసీ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఉత్తంనగర్ బస్టాప్ వద్ద లోలెవల్ రోడ్డు ఉండడంతో ప్రయాణికులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండి పలువురు ద్విచక్ర వాహనదారులు గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. మల్కాజిగిరి సర్కిల్‌తో పాటు మౌలాలి, ఆనంద్ బాగ్ ఇతర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే ఉత్తంనగర్ ఏవోసీ రోడ్డు ప్రధానమైంది. నిత్యం ఉదయం, సాయంత్రం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం గల రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉత్తంనగర్ బస్టాప్ వద్ద ఏఓసీకి వెళ్లే రోడ్డు మార్గంలో ఏర్పడిన భారీ గుంతలు



అన్నపూర్ణ సొసైటీలో రోడ్డు దుస్థితి

మరమ్మతులు చేపడుతాం..



గౌతంనగర్ డివిజన్ పరిధిలో చాలా రోడ్లకు ఇప్పటికే మరమ్మతులు చేయించాం. ప్రమాదకరంగా ఉన్న రోడ్లను సైతం గుర్తించి త్వరలోనే మాన్‌సూన్ సిబ్బందితో తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తాం. శాశ్వత పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మేకల సునీత, కార్పొరేటర్, గౌతంనగర్

‘ప్రజా వ్యతిరేక ప్రభుత్వం పతనం కాక తప్పదు’



మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

మల్కాజిగిరి: ప్రజా వ్యతిరేక ప్రభుత్వం పతనం కాక తప్పదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. చలో బస్‌భవన్ పిలుపులో భాగంగా మల్కాజిగిరి చౌరస్తాలో గురువారం ఆయన నిరసన తెలిపి బస్సులో బస్‌భవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే గతంలో మెట్రో చార్జీలు పెంచారని, ఇప్పుడు బస్సు చార్జీలు కూడా పెంచి ప్రయాణికులపై మరింత భారం మోపిందన్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ప్రారంభమవుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సునీతాయాదవ్ నాయకులు మురుగేష్, పరశురామిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ఎమ్మెల్యే ప్రయాణం

ఉప్పల్: ఆర్టీసీ బస్సు చార్జీలు పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ‘చలో బస్‌భవన్’ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలతో కలిసి గురువారం బస్‌భవన్‌కు వెవెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అందరికీ అందుబాటులో ఉండాలని అది కూడా టికెట్ ధరలు తక్కువగా ఉండాలన్నారు.



బస్సులో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో పాటు కార్పొరేటర్లు తదితరులు


ముదురుతున్న స్థల వివాదం

కబ్జా చేశారని మాజీ మావోయిస్టుల ఆవేదన

ఉప్పల్: ఉప్పల్ మండల పరిధిలోని కల్యాణపురి కాలనీ సర్వే నంబర్ 789/1లో గల 1000 గజాల స్థలం వివాదం రాజకీయ రంగు పులుముకుంటోంది. ఖాళీ స్థలంలో నిర్మాణం చేపడతుండడంతో కొన్ని రోజులుగా పంచాయితీ నడుస్తోంది. అయితే ఈ స్థలం మాది అంటూ మాజీ మావోయిస్టులు కొలా హరిచంద్రతో పాటు మరికొందరు గురువారం విలేకరులతో మాట్లాడారు. తాము మాజీ మావోయిస్టులమని 2003లో అప్పటి ప్రభుత్వం పునరావాసం కింద ఉప్పల్ మండల పరిధిలోని కల్యాణపురి కాలనీ సర్వే నంబర్ 789/1 లో ఉన్న 1000 గజాల స్థలంలో ఒక్కొక్కరికీ 80 గజాల చొప్పున కేటాయించిందన్నారు. అయితే నిర్మాణానికి డబ్బుల్లేక ఇళ్లు కట్టలేకపోయమన్నారు. స్థలం ఖాళీగా ఉండడంతో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ భర్త బీఆర్ఎస్ నాయకుడు బన్నాల ప్రవీణ్ సదరు స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నాడని తమకు న్యాయం చేయాలని సీఎంను కోరుతున్నామన్నారు. కాగా ఈ విషయం ‘సోషల్ మీడియా’లో వైరల్ కావడంతో స్పందించిన బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ గురువారం సాయంత్రం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వారు చెబుతున్న స్థలానికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. చిలుకానగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇతర పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీపీని సైతం కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

కుషాయిగూడ: త్వరలోనే మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని సోమా కల్యాణ మండపం నుంచి రైల్వే ట్రాక్ వరకు చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో వర్షం కురిసినప్పుడల్లా డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతూ మురుగునీరంతా రోడ్లపై పారేదన్నారు. బాక్స్ డ్రైన్ పనులు పూర్తయితే ఇలాంటి సమస్యలకు తావుండదన్నారు. దశలవారీగా అన్ని కాలనీల్లో బాక్స్‌డ్రైన్ పనులు జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సాయికుమార్, శేఖర్‌గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



బాక్స్‌డ్రైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

సమస్యల పరిష్కారానికి కృషి

శామీర్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని లాల్‌గడీమలక్‌పేట్‌లోని దళితవాడలో నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలపై ఆరా తీశారు. ఎస్సీ కాలనీలో పొలాలకు వెళ్లే రోడ్డు మార్గంలోని డ్రైనేజీ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి పాటుపడుతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మండలాధ్యక్షుడు కొర్వి కృష్ణ, మాజీ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.



నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10 న (నేడు) ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 20 కంపెనీలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్లేస్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ తిరుపతయ్య ఫోన్ నంబర్ 9059823318 లో సంప్రదించాలని కోరారు.

ప్రొఫెసర్ శివకుమార్‌కు ఓయూ డాక్టరేట్



ప్రొఫెసర్ ఆర్.శివకుమార్

అల్వాల్: అల్వాల్‌కు చెందిన ప్రొఫెసర్ ఆర్.శివకుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ జోసఫ్ ప్రకాశ్ మోసిగంటి పర్యవేక్షణలో శివకుమార్ ఇన్ఫార్మేషన్ టెక్నాలజీలో ఆటోమేటెడ్ విశ్లేషణ కోసం ‘అక్యూట్ లింపోబ్లాస్టిక్ లూకీమియాపై నూతన డీప్ లెర్నింగ్ విధానాలు’ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. శివకుమార్ ప్రస్తుతం నగరంలోని తపస్యా కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఈ మేరకు కళాశాల అధ్యాపక బృందం శివకుమార్‌ను అభినందించారు.

నేడు ఖోఖో పోటీలు

ఘట్‌కేసర్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఘట్‌కేసర్ జోనల్ స్థాయి ఖోఖో టోర్నమెంట్, క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి పీడీ శ్రీరాములు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14 ఏళ్లలోపు బాలబాలికలు జనవరి 1, 2012 తర్వాత జన్మించినవారు, అండర్–17 ఏళ్లలోపు బాలబాలికలు జనవరి 1, 2009 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నంబర్‌తో స్కూల్ ఒరిజినల్ బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్‌తో అవుషాపూర్ సెయింట్ పాల్స్ హైస్కూల్ (అరోరా కాలేజ్ దగ్గర) శుక్రవారం ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9154525644, 9390068408 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్‌రహిత మున్సిపాలిటీలో భాగస్వాములవ్వాలి

శామీర్‌పేట్ : ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు విద్యార్థులు భాగస్వాములు కావాలని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధి మజీద్‌పూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 7 రోజుల గ్రామ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కాకుండా బట్ట సంచులు, పేపర్ బ్యాగులు వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్రవంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, వీడీ డాక్టర్ హైమావతి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హౌస్ అరెస్ట్



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

కాప్రా: పెంచిన ఆర్టీసీ చార్జీలకు నిరసనగా ఉప్పల్ నుంచి బస్ భవన్ వరకు ‘చలో బస్ భవన్’ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఉదయం ఆయన కార్యాక్రమానికి సిద్ధమవగా కుషాయిగూడ పోలీసులు ముందస్తుగానే గృహ నిర్బంధం చేశారు. ఉదయం సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్న పోలీసులు ఆయనను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.



పోలీసుల అదుపులో కార్పొరేటర్లు శాంతి, సబిత, కార్యకర్తలు

బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు..

అల్వాల్: ఆర్టీసీ టికెట్ ధరల పెంపునకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం చలో బస్ భవన్‌కు పిలుపునిచ్చారు. అల్వాల్, వెంకటాపురం కార్పొరేటర్లు చింతల శాంతి, సబిత, బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగానే అరెస్ట్ చేసి అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిలో నాయకులు అనిల్‌కిశోర్‌గౌడ్, విజయ్‌శేఖర్, జావిద్, మహేందర్, పరమేష్, చరణ్‌గిరి పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్‌లోని సాయి స్వప్న ఆస్పత్రి నుంచి జేబీఆర్ స్కూల్ రోడ్డు వరకు చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.24 లక్షల వ్యయంతో పనులు చేపట్టామని ఇవి పూర్తయితే వరద ముంపునకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గున్నాల చంద్రశేఖర్ యాదవ్, వాసుదేవరావు, సాయిబాబా, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్ నేత, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

ఆర్‌సీసీ పనులు పరిశీలన

వినాయక్‌నగర్ డివిజన్‌లోని జేకేకాలనీలో రూ.80 లక్షలతో చేపట్టిన ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ నవీన్, బీజేపీ నాయకులు సాయి సురేశ్, జగదీష్ చారి, శివగౌడ్ పాల్గొన్నారు.

కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



నాచారంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

మల్లాపూర్: బహుజన రాజ్యాధికార సిద్ధాంత సృష్టికర్త కాన్షీరామ్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని రిటైర్డు అడిషనల్ ఎస్పీ జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. నాచారంలోని బహుజన సాహిత్య కార్యాలయంలో కాన్షీరామ్ 18వ వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. ఆయన హాజరై కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, కొమ్ముగళ్ల వెంకటేశ్, కనుకుంట్ల విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, గణేశ్ గౌడ్, గద్ద యుగేందర్, షాహిన్ సుల్తాన్, ఎండీ రజాక్, సుధాకర్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నాచారంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయక్, జిల్లా కార్యదర్శి దయానంద్, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు మింద్రాల నర్సింగ్ రావు, అనిత, సన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ వార్డు సత్యనారాయణపురం రోడ్డునంబర్–12 లోని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం కాలనీవాసులు, పెద్దల సమక్షంలో దేవాలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా వనంపల్లి గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కర్కల ధీరజ్ రెడ్డి, కోశాధికారిగా లెంకల రమణా రెడ్డి, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన చైర్మన్ మాట్లాడుతూ.. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయ అభివృద్ధికి పాటుపడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు



మల్లాపూర్‌లో చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చేగువేరాకు ఘన నివాళి

మల్లాపూర్: మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లుర్పించారు. ఉప్పల్ నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అజీమ్ పాషా, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో..

ఏఐవైఎఫ్ జిల్లా కార్యాలయం ఈసీఐఎల్‌లో జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజ్‌కుమార్, అనిల్, సాయికుమార్, హాసినా, ప్రేమ్, స్వప్న, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్‌లోఎమ్మెల్యే పర్యటన

ఎస్‌టీపీ ప్లాంట్ స్థలం పరిశీలన

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం పర్యటించారు. ఎస్‌టీపీ నిర్మాణానికి కేటాయించిన 4 ఎకరాల స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్‌హిల్స్, కురుమానగర్, లక్ష్మీనారాయణ కాలనీవాసులు ఎస్‌టీపీ వల్ల కాలనీలకు దుర్వాసన వచ్చే ప్రమాదం ఉందని, ఇప్పటికే మూసీ నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తమను మరో ప్రాంతానికి తరలించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులకుతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



ఎస్‌టీపీ ప్లాంట్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అధికారులు